

వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు భద్రత కల్పించాలి. ఆస్పత్రి వద్ద పోలీస్ ప్రొటెక్షన్ ఏర్పాటు చేస్తే వైద్య సిబ్బందికి రక్షణగా ఉంటుంది. అప్పుడే భయపడకుండా విధులు నిర్వహించగలం. కోల్‌కతాలో వైద్యురాలిని హత్య చేసిన వారిని తాత్సారం చేయకుండా శిక్షించాలి. తక్షణ చర్యలు చేపట్టినప్పుడే దోషులకు భయం ఉంటుంది.

– కె.స్వప్న, వైద్యాధికారి, రేవిడి పీహెచ్‌సీ



కఠిన చట్టం తీసుకురావాలి



వైద్యులు, వైద్య సిబ్బంది నిత్యం ఆస్పత్రుల్లో విభిన్నమైన పరిస్థితుల్లో పని చేయాల్సి ఉంటుంది. మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బంది రాత్రి వేళల్లో పనిచేసేటప్పుడు సెక్యూరిటీ తప్పనిసరిగా ఉండాలి. కోల్‌కతాలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రత్యేకమైన భద్రత సౌకర్యాలు కల్పించాలి. దోషులను కఠినంగా శిక్షించే ప్రత్యేకమైన చట్టం అందుబాటులోకి తేవాలి.

– సౌజన్య, ఆయుర్వేద వైద్యాధికారి, రేవిడి

క్లుప్తంగా

పైప్‌లైన్‌కు మరమ్మతులు



సంగివలసలో పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలసలో శనివారం ఓ లారీ పైప్‌లైను మీద నుంచి వెళ్లడంతో అది పగిలింది. 'పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథా' నే శీర్షికతో 'సాక్షి'లో ఆదివారం ప్రచురించిన వార్తకు అధికారులు తక్షణం స్పందించారు. ఈ మేరకు ఇంజినీరింగ్ సిబ్బంది ఆదివారం పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. సంగివలస–పాండ్రంగి రహదారిలో పైప్‌లైన్ పగిలిన కారణంగా ఈ మార్గం చెరువులా మారిన సంగతి తెలిసిందే.

సిద్ధి గణపతికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సిద్ధి గణపతి

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు ప్రాంతంలోని గనగళ్ల వీధిలో కొలువైన సిద్ధి గణపతి ఆలయ ఆరో వార్షికోత్సవం ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్టలక్ష్మీ దేవాలయ ప్రాంగణంలో కొలువైన శ్రీ వైశాఖేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్పటిక లింగ స్వరూపాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు విఘ్నేశ్వరుడికి పూజ చేసి 108 కలశాలతో పురవీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక అభిషేకాలు, హోమం, మండలారాధనలు నిర్వహించారు.

ఏఐటీయూసీ సభలు జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మధురవాడ: సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు విశాఖలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఆదివారం సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మరుపిళ్ల పైడిరాజు, ఎం.మన్మధరావు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఠా, భవన నిర్మాణ, కలాసి తదితర అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టం చేయాలన్నారు.

కొండవాలు.. సమస్యలు కోకొల్లలు

- అసౌకర్యాల నడుమ జీవిస్తున్న కొండపేట వాసులు
- అస్తవ్యస్తంగా రహదారి మార్గాలు
- ఆందోళన కలిగిస్తున్న ఐరన్ విద్యుత్ స్తంభాలు
- ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి



మెట్ల మార్గం లేని కొండపైకి ఏటవాలు ప్రాంతం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేట కొండవాలు ప్రాంతంలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడి ప్రజలు పూర్తిగా అసౌకర్యాల నడుమ జీవిస్తున్నారు. కొండపై సంతోషిమాత ఆలయం మొదలుకుని శివాలయం వెనుక వరకు వాలు ప్రాంతంలో వందలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. ముఖ్యంగా చిట్టివలస జెడ్పీ హైస్కూల్ నుంచి కొండపైకి వాలు ప్రాంతాల్లోని వివిధ మార్గాల్లో నివసిస్తున్న వారికి సరైన రహదారి మార్గాలు లేవు. పూర్తిగా వాలు ప్రాంతం కావడం, ఒక్కో చోట అడ్డదిడ్డంగా నిర్మించిన మెట్లపై ద్విచక్ర వాహనాలతో రాకపోకలు సాగించలేకపోతున్నారు. మెట్లపై వాలు ఎక్కువగా ఉండటంతో నడిచి కూడా వెళ్లలేక పోతున్నారు.

ఇళ్లకు అడ్డంగా పైప్‌లైన్లు

కొండపేటలో ఇంటింటా నిర్మించిన కుళాయిలకు పైప్‌లైన్లను రాకపోకలు సాగించే సీసీ రోడ్డు మార్గంలో ఇష్టానుసారంగా వేయడంతో ద్విచక్ర వాహన చోదకులు వాటిని దాటేటప్పుడు జారి పడుతున్నారు. నడిచి వెళ్లే వారికి కాళ్లకు పైపులు తగులుతుండటంతో తరచూ గాయాల పాలవుతున్నారు. వాలు ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు గాను ఎక్కువగా ఐరన్ స్తంభాలను వినియోగిస్తుండటంతో అవి తుప్పు పట్టడం, వర్షాలకు షాక్ కొట్టడం వంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కొండవాలు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వాలు తగ్గించి ప్లాట్‌ఫారాలు నిర్మించాలి..

కొండపేట–గుడివాడ రహదారి నుంచి కొండవాలు ప్రాంతంలో చివరి వరకు చేరుకోవడానికి వాలు ఎక్కువగా ఉండటంతో పైకి, కిందకు చేరుకోవడానికి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి వంద మీటర్లకు వాలును చదును చేసి ప్లాట్‌ఫారాలు నిర్మిస్తే రాకపోకలకు వీలు ఉంటుందంటున్నారు.

కొండపైకి వెళ్లేందుకు అవస్థలు

నిత్యం ఈ ప్రాంతంలో సేవలు అందించే పారిశుధ్య సిబ్బంది చెత్త భారాన్ని, స్థానికులు రేషన్, కిరాణా సరకులు మోసుకుంటూ వెళ్లలేక పోతున్నారు. వాలు ఎక్కువగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా కొండపైకి వెళ్లలేక మొరాయిస్తున్నాయి. కాళీ మఠం పక్క నుంచి మార్గంలో నిర్మించిన మెట్ల మార్గంలో కూడా వాలు ఎక్కువగా ఉండటంతో వాహనదారులు బోల్తా పడుతున్నారు. ఇక వృద్ధులు, దివ్యాంగులు వాలు ప్రాంతంలోని ఏ మార్గంలోను కూడా రాకపోకలు సాగించలేకపోతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది సర్వే చేసి కొండపేట కొండపైకి చుట్టూ పలు మార్గాల్లో రాకపోకలు సాగించడానికి అనువుగా వాలు, మెట్ల మార్గాలను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా మెట్ల మార్గం



ఇళ్ల ముందు రోడ్డుకు అడ్డంగా పైప్‌లైన్లు



కొండపేటలో ఐరన్ విద్యుత్ స్తంభం

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం

వీనులవిందుగా భజగోవిందం



ప్రత్యేక మండపంలో రాధాకృష్ణులు



భజగోవిందం నిర్వహిస్తున్న సంగీత కళాకారులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠ ప్రాంగణంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు శ్రీకృష్ణ భగవానుడి దర్శనాలు కల్పించారు. 108 పలకలతో ఏర్పాటు చేసిన హరినామ జప మండపంలో 3 వేల మంది భక్తులు పాల్గొని 108 సార్లు హరినామ జపం చేసి ప్రశాంతత పొందారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు 108 మంది ప్రసిద్ధ సంగీత కళాకారులచే సామూహిక భజగోవిందం కార్యక్రమాన్ని వీనులవిందుగా ఆలపించారు. మూడు రోజుల పాటు వేడుకలు జరుగుతాయని డాక్టర్ నిష్కించిన భక్తదాస తెలిపారు. వివరాలకు భక్తులు 95425 11108లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఇస్కాన్‌లో ఘనంగా..

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం శ్రీ రాధాదామోదరులు, జగన్నాథ, సుభద్ర, బలభద్రుల విగ్రహాలను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక భక్త బృందంచే ఉదయం 8 గంటలకు అఖండ హరినామ సంకీర్తన మొదలైంది. పుణ్య నదుల నుంచి సేకరించిన జలాలు, పంచామృతాలతో భక్తులు స్వయంగా స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అత్యంత రమణీయంగా అలంకరించిన స్వామిని ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు దర్శనం చేసుకుని పునీతులయ్యారు. అనంతరం బాలగోపాలుడికి ఉయ్యాల సేవ చేశారు. కొందరు భక్తులు 108 సార్లు హరేకృష్ణ నామాన్ని జపించారు. ప్రముఖ గాయకులు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, నృత్యకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవని శ్రీకృష్ణుడి లీలలపై చేసిన ప్రవచనాలు భక్తులను భక్తి పారవశ్యంతో ముంచెత్తాయి.



ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు, జగన్నాథ సుభద్ర బలభద్రులు

కుంతీమాధవునికి లక్ష తులసి పూజ



కుంతీమాధవ స్వామికి లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న వేద పండితులు



తులసీదళాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఎంపీపీ రాంబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు

పద్మనాభం: మండల కేంద్రం పద్మనాభంలో వెలసిన కుంతీమాధవ స్వామి ఆలయంలో ఆదివారం లక్ష తులసి పూజ ఘనంగా జరిగింది. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, ఉత్సవ కమిటీ సభ్యులు కాళ్ల నగేష్‌కుమార్, తాలాడ పద్మనాభం, సుంకర నారాయణరావు, కంటుబోతు ఎర్నాయుడు తులసీదళాలతో కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి ఆలయం లోపలికి తీసుకెళ్లారు. అనంతరం తులసి పూజ ప్రారంభమైంది. ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయస్వామి సహకారంతో విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చిన వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ తులసి పూజ నిర్వహించారు. మహిళలు తులసీదళాలను బుట్టల్లో వేసి అందజేయగా.. వేద పండితులు పూజను దిగ్విజయంగా జరిపారు. తులసీదళాలు వెదజల్లిన పరిమళాలతో కుంతీమాధవ స్వామి ఆలయ పరిసరాలు గుభాళించాయి. పరిసర మద్ది, కృష్ణాపురం, రెడ్డిపల్లి నుంచే కాకుండా దూర ప్రాంతాలైన విజయనగరం, తగరపువలస, సింహాచలం నుంచి తరలివచ్చిన భక్తులు లక్ష తులసి పూజను కనులారా వీక్షించి తరించారు.

ఆనందమానందమాయె..



భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సందడి

భీమిలి హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1976 నుంచి 1979 వరకు చదువుకున్న 8, 9, 10 తరగతుల పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకుని ఆనందంగా గడిపారు. వారి ఆత్మీయ కలయికకు విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల వేదికైంది. ఎన్నో ఏళ్ల తరువాత అందరూ కలుసుకోవడంతో ఎంతో భావోద్వేగాలకు లోనైయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత, వృత్తి, ఉద్యోగ విషయాలను పంచుకున్నారు.నాడు చేసిన అల్లరి, సరదా పనులను గుర్తుచేసుకున్నారు. అందరూ ఆట, పాటలతో సందడిగా గడిపారు. తమతో చదువుకుని ప్రస్తుతం పేదరికంలో ఉన్న ముగ్గురికి రూ.5 వేల చొప్పున అందించారు. తమ తరఫున పాఠశాలకు మైక్‌సెట్‌ను వితరణ చేశారు. రచయిత, పూర్వ విద్యార్థి పి.ఆర్.పి.వర్మ తాను రాసిన అందాల జాబిలి భీమిలి పుస్తకాన్ని అందరికీ బహూకరించారు. సాయంత్రం వరకు ఎంతో ఉల్లాసంగా గడిపిన వీరందరూ వీడ్కోలు చెప్పుకుని తమ గమ్యస్థానాలను బయలుదేరారు. ముఖ్యులు రవికుమార్, చిన్నయ్యపాత్రుడు, మైలిపల్లి లక్ష్మణరావు, రేఖ రామారావు, కలిగొట్ల భానోజీరావు, కె.సన్యాసినాయుడు, సన్నిబాబు తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

3.8 కిలోల గంజాయి స్వాధీనం

పీఎం పాలెం: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకుని 3.8 కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలిలా.. ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటల సమయంలో మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన సిగటపు సాయి అవినాష్, సిహెచ్.సింహాచలం, గణేష్‌నగర్‌కు చెందిన పిల్లా నారాయణ, పెద్దిన రవి మారికవలస డంపింగ్ యార్డు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్టు పీఎం పాలెం పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ కె.సురేష్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేయగా ముగ్గురు చిక్కారు. పెద్దిన రవి పరారయ్యాడు. వీరి వద్ద నుంచి 3.8 కిలోల గంజాయి ప్యాకెట్లు, అదనంగా మరో 30 గ్రాముల గంజాయి, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరకు నుంచి గంజాయి తీసుకొచ్చామని నిందితులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

పీఎం పాలెం: గుర్తు తెలియని ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఒక వ్యక్తి మృతికి కారకుడయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలిలా.. అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన పగడాల రమణ(50) అనే వ్యక్తి విశాఖ నగరంలోని పెట్రోల్ బంకుల వద్ద జరిగే పనుల్లో కూలీగా చేస్తుంటాడు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో సహచర కూలీ దాస్‌తో కలిసి కొమ్మాది నుంచి కార్‌షెడ్ కూడలికి వచ్చే ఆటో ఎక్కాడు. డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో పగడాల రమణ కిందకు పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో అధికంగా రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆటో డ్రైవర్ క్షతగాత్రుడిని కనీసం పట్టించుకోకుండా సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. రమణను వెంటనే వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా.. అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుమార్తె నీలిమ శనివారం రాత్రి పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అందొచ్చిన కొడుకు అనంత లోకాలకు..

- బైకు ఢీకొని యువకుడి మృతి
- కుమారుడి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు



శ్రీనివాసరావు (ఫైల్)



కనకల శ్రీనివాసరావు మృతదేహాన్ని పట్టుకుని రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పద్మనాభం: చేతికి అందొచ్చిన కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రుల శోకానికి అవధులు లేకుండా పోయింది. కుమారుడు తమను ఆదుకుంటాడనుకున్న తల్లిదండ్రుల ఆశలను మృత్యువు అడియాశలు చేసింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ జిల్లా ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల శ్రీనివాసరావు(36) పని మీద శనివారం ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లాడు. పని ముగించుకుని అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బోని వస్తుండగా.. మార్గం మధ్యలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పద్మనాభం మండలం విజయానందపురం జంక్షన్ వద్ద చెరువుకు సమీపంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై భార్య శ్రీవలికతో కలిసి వస్తున్న అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఆర్.వి.అగ్రహారానికి చెందిన లెక్కల సతీష్.. శ్రీనివాసరావును ఢీకొట్టాడు. అతడి తలకు బలమైన గాయాలవ్వడంతో 108 అంబులెన్స్‌లో విజయనగరం మహారాజా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అప్పటికే శ్రీనివాసరావు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో సతీష్, శ్రీవలిక దంపతులకు గాయలవ్వడంతో అదే ఆస్పత్రిలో చేర్పించారు. సతీష్ పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులకు శ్రీనివాసరావే ఆధారం

మృతుడు కనకల శ్రీనివాసరావుకు తండ్రి సీతారాం, తల్లి రమణ, చెల్లి అప్పలకొండ, అక్క ఆదిలక్ష్మి ఉన్నారు. అక్క, చెల్లిల వివాహాలు జరిగి అత్తవారింటి వద్ద ఉంటున్నారు. శ్రీనివాసరావు ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. శ్రీనివాసరావు తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో శ్రీనివాసరావును తిరిగిరాని లోకాలకు తీసుకుపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధిస్తున్నారు.

నిబంధనలు బేఖాతర్..!

- అనుమతులు లేకుండా పెట్రోల్ బంక్ నిర్మాణం
- పనులు ఆపక పోవడంతో శ్లాబుకు రంధ్రం చేసిన అధికారులు



మధురవాడ వుడా కాలనీ రోడ్డులో నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంక్



టౌన్ ప్లానింగ్ అధికారులు అంటించిన నోటీసు

మధురవాడ: కాస్త పలుకుబడి, అధికారం అండ ఉన్న వారికి ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం అడ్డురావడం లేదు. జీవీఎంసీ అధికారులు అందించే నోటీసులు కూడా తీసుకోవడానికి ఇష్టపడటం లేదు. రెండు నెలలుగా ఏ రకమైన అనుమతులు తీసుకోకుండా, జీవీఎంసీకి ట్యాక్స్‌లు కట్టకుండా చకచకా పనులు చేసుకువెళ్లిపోవడం వెనుక పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 279/9 జీవీఎంసీ 8వ వార్డులోని పాత పోలీస్ స్టేషన్ పక్కన నిర్మిస్తున్న పెట్రోల్ బంకే ఇందుకు నిదర్శనం. మధురవాడ వుడా కాలనీ–ఐటీ సెజ్ వుడా 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డులో సుమారు 800 గజాల స్థలంలో అనధికారకంగా పెట్రోల్ బంక్ నిర్మాణం జరుగుతోంది. దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయి. సాధరణంగా ప్లాన్ పొందాలంటే రూ.లక్షల్లో ప్రభుత్వానికి వివిధ రకాల పన్నులు, ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ అవేవీ చేయలేదు. ఇంత జరుగుతుంటే ఇప్పటికి స్పందించిన జీవీఎంసీ ఇది అనధికార నిర్మాణమని నోటీసు జారీచేసి పనులు నిలుపుదల చేయించింది. జీవీఎంసీ రెవెన్యూ అధికారులు మాత్రం సుమారు రూ.2.50 లక్షలు వీఏఎల్‌టీ చెల్లించాలని నోటీసు అందించడానికి తిరుగుతున్నా.. సదరు నిర్వాహకులు అందుబాటులోకి రావడం లేదని అసిస్టెంట్ కమిషనర్ శివరావు చెప్పారు. దీనిపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సెక్రటరీని వివరణ కోరగా.. ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా బంక్ నిర్మాణ పనులు చేపడుతుండటంతో పలు యాక్ట్‌ల కింద నోటీసు అంటించి పనులు ఆపమని చెప్పినా.. వినక పోవడంతో శ్లాబుకు రంధ్రం చేసినట్టు చెప్పారు.

చంద్రంపాలెంలో 33 అడుగుల వినాయకుడు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెంలో 33 అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం భీమిలి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణులు



నృత్య రూపకం

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామం(జాతర)లో ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. సాలూరుకు చెందిన పూర్ణిమ కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు చూడచక్కని నృత్యాభినయంతో అలరించారు. గణపతి స్తుతీ గీతంతో కార్యక్రమం ప్రారంభం కాగా.. మహిషాసుర మర్ధిని నృత్య రూపకం ప్రదర్శనలో హైలెట్‌గా నిలిచింది. అఖిలాండేశ్వరి, ప్రణవాలయం పాణి, హరహర మహదేవ, నెమలికి నేర్పిన నడకలివీ, అయిగిరి నందిని వంటి గీతాలకు అద్భుతంగా కూచిపూడి నృత్యం చేసి అలరించారు. పూజిత, చైత్ర, దివ్య చంద్రిక, మోక్షిత, సాయి కౌస్విత, గుణప్రియ ఈషిత, జ్యోషిత, గీతశ్రీ మొదలగు కళాకారులు పాల్గొనగా.. పూర్ణిమానాయుడు నృత్య దర్శకత్వం వహించారు.